ధర్మరథాల స్థానంలో విద్యుత్ బస్సులు

ప్రజాశక్తి -తిరుమల: శ్రీవారి ధర్మరథాల (ఉచిత బస్సులు) స్థానంలో విద్యుత్ బస్సులు నడిపేందుకు 10 బస్సులు విరాళంగా ఇవ్వనున్నట్లు మెగా కంపెనీ అధినేత తెలిపారు. ఒలెక్ట్రా కంపెనీ తయారుచేసిన సుమారు రూ.15 కోట్ల విలువైన 10 బస్సులు ఆదివారం తిరుమలకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం టీటీడీకి అందిచనున్నట్లు మెగా, ఓలెక్ట్రా కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లు పివి కృష్ణారెడ్డి, కెవి ప్రదీప్ పేర్కొన్నారు.

కంచె దాటితే ఉద్యోగం తీసేస్తాం

- కార్మికులకు ఈసీఎల్ హెచ్చరిక
- చిందేపల్లి నిరసనకు మద్దతివ్వకూడదని హుకూం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్(ల్యాంకో) పరిశ్రమ నిర్వాహకులు తమ నిరంకుశ విధానాలకు పాల్పడుతున్నారు. చిందేపల్లె వాసులు చేసే ఆందోళనకు, నిరసన కార్యక్రమాలకు మద్దతు తెలిపితే ఉద్యోగం నుంచి తీసేస్తామని కార్మికులకు శనివారం సాయంత్రం నోటీసులు జారీ చేసింది. ఇలా చేయడం కార్మికుల హక్కులను కాలరాయడమేనని సంఘాల నేతలు అంటున్నారు. పరిశ్రమ నిర్వాహకులు తమ పంతం నెగ్గించుకోవడానికి ఇలా బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామిక చర్య అని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే ఏర్పేడు మండలం చిందేపల్లెకు వెళ్లే రహదారిని ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమ వారు వారం రోజుల కిందట మూసివేసిన సంగతి తెలిసిందే.

సుమారు ఎనిమిది దశాబ్దాలుగా ఉన్న ఈ రహదారిని ఈసీఎల్ పరిశ్రమ వారు తమ ఆధీనంలోకి తీసుకుని రహదారికి అడ్డంగా నిర్మాణం చేశారు. వీరికి పోలీసు, రెవెన్యూ యంత్రాంగం వత్తాసు పలుకుతోంది. తరతరాలుగా ఉన్న రహదారిని అలాగే వదలాలని చిందేపల్లె వాసులు వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వీరికి మద్దుతుగా సీపీఎం, టీడీపీ, జనసేన, బీజేపీ అండగా నిలిచాయి. అయినా ఈసీఎల్ పరిశ్రమ వారు ఖాతరు చేయడం లేదు. ఆందోళన చేసే వారిపై లాఠీలు ఝులిపించడంతో పాటు అక్రమకేసులు బనాయిస్తున్నారు. సామాన్య ప్రజలపై అక్రమకేసులు బనాయిస్తుండటంతో పరిశ్రమలో పనిచేసే కార్మికుల్లో కూడా తిరుగుబాటు వస్తోంది. చిందేపల్లె వాసులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మద్దతు తెలపాలని కొంతమంది కార్మికులు ఓ నిర్ణయానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఈసీఎల్ యాజమాన్యం చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇందులో భాగంగా ముందస్తుగా కార్మికులకు హెచ్చరిక నోటీసులు జారీ చేసింది. పరిశ్రమలో పని చేసే వారు ఎవరైనా సరే చిందేపల్లె వాసులు చేసే ఆందోళనకు మద్దుతు తెలిపినా... నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నా వెంటనే విధుల తొలగిస్తామని ప్రకటించింది. కార్మికులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని నోటీసుల్లో హెచ్చరించారు. పరిశ్రమ నిర్వాహకులు ఇలా నోటీసులు ఇవ్వడంతో అక్కడ పని చేసే పేదకార్మికులు ఆందోళన చెందుతున్నారు. తాము భూములు ఇవ్వడంతో ఏర్పడిన పరిశ్రమ ఇలా ఆంక్షలు విధించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. తమ ఉద్యోగం పోయినా సరే చిందేపల్లె వాసులకు మద్దతుగా నిలుస్తామని పలువురు కార్మికులు చెబుతండటం విశేషం. రహదారికి అడ్డంగా కట్టిన గోడను తొలగించేంత వరకు ఆందోళన చేస్తామని వారు ప్రకటించారు. ఈ పరిణామం ఎక్కడకు దారి తీస్తుందో వేచి చూడాలి.

చిందేపల్లె రహదారిని కొనసాగించాలి: మానవ హక్కుల వేదిక

ఏర్పేడు మండలంలోని చిందేపల్లె గ్రామానికి పూతలపట్టు- నాయుడుపేట ప్రధాన రహదారి నుంచి ఈసీఎల్ పరిశ్రమ మీదుగా అనాదిగా ఉన్న రహదారిని కొనసాగించాలని మానవ హక్కుల వేదిక నేతలు డిమాండు చేశారు. మానవ హక్కుల వేదిక, దళిత హక్కుల పోరాట సమితి, మహిళా సమాఖ్యకు చెందిన ప్రతినిధుల బందం ఆదివారం ఈసీఎల్ పరిశ్రమ వద్ద మూసివేసిన చిందేపల్లె రహదారిని పరిశీలించింది. ఈ రహదారికి సంబంధించి పూర్వాపరాలను వారు స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు యూజీ శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనరు మదనశేఖర్, దళిత హక్కుల పోరాట సమితి తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కాళయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సి.రత్నమ్మ మాట్లాడుతూ సుమారు ఎనిమిది దశాబ్దాలుగా ఉన్న చిందేపల్లె రహదారికి అడ్డంగా గోడకట్టి మూసి వేయడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. ప్రజలకు అండగా నిలవాల్సిన అధికార యంత్రాంగం పరిశ్రమ నిర్వాహకులకు వత్తాసు పలకడం అన్యాయమన్నారు. చిందేపల్లె పరిసర ప్రాంతాల ప్రజలు ఇచ్చిన భూమిలో 1993-94 ప్రాంతంలో ల్యాంకో పరిశ్రమ ఏర్పాటు చేశారన్నారు. రాచగున్నేరి నుంచి చిందేపల్లి గ్రామాలను కలిపే రోడ్డు ల్యాంకో పరిశ్రమ మధ్య నుంచి వెళుతూ శ్రీకాళహస్తి రోడ్డులో కలుస్తుందన్నారు. 25 ఏళ్లుగా ఇక్కడ ఎలాంటి సమస్య లేదన్నారు. అయితే ఐదేళ్ల కిందట కలకత్తా నుంచి కొత్తగా వచ్చిన యాజమాన్యంతో రోడ్డు విషయంలో వివాదం మొదలైందన్నారు. ఒకపుడు 60ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పరిశ్రమ నేడు సుమారు 250 ఎకరాల వరకు విస్తరింప చేసుకుందన్నారు. అందులో భాగంగానే చిందేపల్లె రహదారిని ఈ పరిశ్రమ వారు ఆక్రమించారని వారు ఆరోపించారు. చిందేపల్లె వాసులు ఈదారిలో వెళ్లడం పరిశ్రమ వారికి ఎందుకు ఇష్టం లేదో అర్థం కావడం లేదన్నారు. ఈ మధ్య కాలంలో యాజమాన్యానికి, ప్రభుత్వానికి మధ్య ఏం ఒప్పందం జరిగిందో తెలియదు కానీ, యాజమాన్యం గత ఏడాది డిసెంబరు 31 నుంచి రోడ్డుకు అడ్డంగా గేటు వేయడం ప్రారంభించిందన్నారు. ఈ కారణంగా చిందేపల్లె వాసులు ఆందోళన ప్రారంభించారని వారు తెలిపారు. దీంతో పరిశ్రమ నిర్వాహకులు మొదట కొంత వెనక్కు తగ్గారన్నారు. అయితే పరిశ్రమ యాజమాన్యం చిందేపల్లి గ్రామప్రజలను నియంత్రించడానికి ఈనెల 18న ప్రభుత్వం సహకారంతో పోలీసులను దించి గోడను నిర్మించిందన్నారు. పోలీసులు నిరసన తెలిపిన ప్రజలను అదుపులోకి తీసుకొని అదేరోజు సాయంత్రం వదలిపెట్టారన్నారు. యాజమాన్యం తాను కబ్జా చేసుకున్న రోడ్డుకు ప్రతిగా మరోరోడ్డును నిర్మిస్తామని చెబుతోందన్నారు. ప్రభుత్వం, రెవెన్యూ యంత్రాంగం దానికి వంతపాడడం శోచనీయమన్నారు. చిందేపల్లి ప్రజలు ముందు నుంచి ఉన్న రోడ్డుకు ప్రతిగా యాజమాన్యం నిర్మించిన రోడ్డును వ్యతిరేకించడానికి ప్రధాన కారణాలు రెండు ఉన్నాయన్నారు. రోడ్డును వంకకు ఆనుకొని నిర్మించడం వలన వర్షాకాలంలో కోతలకు గురి అయ్యే అవకాశం ఉందని.. అదేవిధంగా ఆ రోడ్డు నుంచి ప్రజలకు రక్షణ లేకపోవడంతోపాటు, ఆ దారి అంతకు ముందున్న రోడ్డు కన్నా 4.5 కి.మీ ఎక్కువ దూరం కావడం రెండో కారణమన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి చిందేపల్లె వాసులకు న్యాయం చేయాలని వారు డిమాండు చేశారు. చిందేపల్లె వాసులపై అక్రమకేసులు పెట్టడం మానుకోవాలన్నారు. ఇలా తప్పుడు కేసులు పెట్టడం మానవ హక్కుల వేదిక తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. చిందేపల్లె వాసులకు అండగా తాము న్యాయ పోరాటం చేస్తామని వారు ప్రకటించారు.

ఎల్వీఎం-3 విజయవంతం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఇస్రో పంపిన 36 ఉపగ్రహాలను ఎల్వీఎం-3 రాకెట్ కక్ష్యలోకి చేర్చింది. ఈ రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ఇస్రో ప్రకటించింది. ఆదివారం ఉదయం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం (షార్)లో ఎల్వీఎం-3 రాకెట్ ప్రయోగం జరిగింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకు షార్ ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం-3 రాకెట్ నింగిలోకి ప్రయాణం ప్రారంభించింది. వన్‌వెబ్‌కు చెందిన మొత్తం 36 ఉపగ్రహాలతో బయల్దేరింది. దాదాపు 20 నిమిషాల ప్రయాణం తర్వాత భూమి ఉపరితలం నుంచి 450 కి.మి. చేరుకుంది. మోసుకెళ్లిన ఉపగ్రహాలను ఒక్కొక్కటిగా లియో ఆర్బిటల్ వత్తాకార కక్ష్యలోకి రాకెట్ ప్రవేశపెట్టింది. కాగా ఎల్వీఎం-3 ఎం-3 రాకెట్ ఎత్తు 43.5 మీటర్లు. బరువు 643 టన్నులు. 36 ఉపగ్రహాల బరువు 5,805 కిలోలు. రాకెట్ మోసుకెళ్లిన ఉపగ్రహాల బరువు 5.8 టన్నులు. ఇస్రోకు చెందిన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, వన్ వెబ్‌ల మధ్య మొత్తం 72 ఉపగ్రహాలను నింగిలోకి చేర్చేందుకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా గతేడాది అక్టోబరు 23న మొదటి 36 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేర్చింది. తాజా ప్రయోగంలో మిగతా 36 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది.

రాకెట్ ప్రయోగ కేంద్రంలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి శనివారం ఉదయం 9 గంటల 20 సెకండ్లకు జరిపిన ఎల్విఎం3 -ఎం3 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం ఇస్రో వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ప్రయోగం ద్వారా యూకేకి చెందిన 36 ఉపగ్రహాలను భూమికి దగ్గరలోని 450 కిలోమీటర్ల ఎత్తు కక్షలో ఉపగ్రహాలను నిలపడం జరిగింది. ప్రయోగం అనంతరం 34 నిమిషాలకు మొదటి 16 ఉపగ్రహాలను కక్షలో వదిలిపెట్టడం జరిగింది. మిగిలిన 20 ఉపగ్రహాలను గంటా 37 నిమిషాలకు నిర్దిష్ట కక్షలోకి పంపడం జరిగింది. 36 ఉపగ్రహాలు కక్షలోకి చేరుకున్న తరువాత ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతం అయినట్లు ప్రకటించారు. వన్‌వెబ్ ద్వారా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల మేరకు ప్రయోగించిన ఈ రాకెట్ ప్రయోగ విజయం ఇస్రో స్థాయిని మరింత ఉన్నత స్థాయికి పెంచింది. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ ఎల్విఎం3- ఎం3 రాకెట్ ప్రయోగ విజయం ఒక చారిత్రాత్మకమని దీని వల్ల ఇస్రోకు వాణిజ్యపరమైన ప్రయోగాల ప్రయోజనాలకు బలం చేకూరిందన్నారు. ఇస్రోకు ఇది ఒక గర్వకారణమని అన్నారు. ఇదే స్ఫూర్తితో మరో వాణిజ్య ప్రయోగంకు సిద్ధమవుతున్నట్లు సింగపూరుకు చెందిన ఉపగ్రహం పిఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు సోమనాథ్ తెలియజేశారు.

10 నుంచి వస్త్రాలు ఈ-వేలం

ప్రజాశక్తి- తిరుపతి సిటి: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా ఇచ్చిన వస్త్రాలను ఏప్రిల్ 10వ తేది నుంచి 15వ తేదీ వరకు ఈ- వేలం వేయనున్నట్లు టిటిడి పిఆర్ఓ డాక్టరు టి.రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన వస్త్రాలు 297 లాట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ఆర్ట్‌సిల్క్, పాలిస్టర్ దోతీలు, ఉత్తరీయాలు, చీరలు, ఆప్ చీరలు, క్లాత్ బిట్స్, బ్లౌజ్ పీసులు, టర్కి టవళ్లు, లుంగీలు, శాలవలు, బెడ్‌షీట్లు, హుండీ గల్లేబులు, దిండుకవర్లు, పంజాబీ డ్రస్ మెటీరియల్స్, జంకాళం కార్పెట్లు, దుప్పట్లు, కర్టన్లు, గర్భగృహకురాళాలు, బంగారువాకిలి పరదాలు, శ్రీవారి గొడుగులు ఉన్నాయని తెలిపారు. వివరాలకు టిటిడి వెబ్‌సైట్‌ను, 0877 2264429 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

కిడ్నీ రోగులకు రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి- తిరుపతి సిటి: శ్రీవెంకటేశ్వర ఏపి స్టేట్ కిడ్నీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో రిటైర్డు ఎంపిడిఓ పి.జ్ఞానాంబ స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న కిడ్నీ రోగులకు రూ.50వేల నగదును విరాళంగా అందజేసింది. స్థానిక స్విమ్స్ ఆసుపత్రిలో డైరెక్టరు డాక్టరు వెంగమ్మను ఆదివారం కలిసిన ఆమె ఈ మొత్తాన్ని అందజేశారు. తన భర్త పి.కుమారస్వామి గతంలో స్విమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేసుకుంటూ చనిపోయారని, ఆయన జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని స్విమ్స్‌కు అందజేస్తామని దాత తెలిపారు. దాతలు ఇచ్చిన మొత్తాన్ని కిడ్నీ రోగుల సేవలకు వినియోగిస్తామని, తరుచు కిడ్నీ రోగులకు మందులు, ఇంజక్షన్లు విరాళంగా అందింపచేస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంట్రామయ్యను, దాతలను ఆమె అభినందించారు.

వైభవంగా సూర్యపూజోత్సవం

సీతాలక్ష్మణ సమేత కోదండ రామస్వామి అలంకరణలో వేదనారాయణుడు

ప్రజాశక్తి- నాగలాపురం: నాగలాపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో సూర్యపూజ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్యహజ మహోత్సవ కార్యక్రమం వైభవం జరిగింది. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పరివార దేవతామూర్తులకు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేదనారాయణ స్వస్వామి ఉత్సవర్లకు ఆలయ ఆవరణలో పంచామతాలతో అభిషేకాలు చేసి స్నపన తిరుమంజన సేవ నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి అలంకరణలో అలంకరించి తిరుచ్చిపై పుష్కరిణి వద్దకు మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లి అక్కడ హారతులు చేపట్టారు. తదనంతరం తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు కోలాటాలు భజన బందాల నడుమ తిరుచ్చిపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ తిరువీధి ఉత్సవంలో వచ్చిన స్వామి, అమ్మవార్లకు భక్తులు కర్పూర నీరాంజనాలు పట్టి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి తిరువీధి ఉత్సవం అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి ఏకాంత సేవ జరిపారు.

నిరాశ పరిచిన సూర్యకిరణాలు

నాగలాపురం వేదనారాయణ స్వామి ఆలయంలో సూర్యహజ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం సూర్యకిరణాలు. ఆలయంలోకి రాకుండా భక్తులను నిరాశ పరిచాయి. ఆకాశం మబ్బులతో ఉండడంతో సూర్యకిరణాల ప్రసరణకు అంతరాయం ఏర్పడింది. సూర్యకిరణాలు ప్రసారమయ్యే సమయాన్ని గుర్తించి ఆలయ పరిచారకులు పుణ్యజలంతో ప్రసారమార్గాన్ని అభిషేకించి స్వామివారికి హారతులిచ్చారు. ఈ పూజా కార్యక్రమాలను సూపరింటెండెంట్ ఏకాంబరం, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ రాంమోహన్, డిప్యూటీ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారి చంద్రశేఖర్, ఇంజనీరింగ్ ఏఈ గురు ప్రసాద్, ఆలయ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు, షరాబ్ ఉదయకుమార్లు పర్యవేక్షించారు.

సమాజసేవ కోసం పోలీసునయ్యా..!

ఇంటర్వ్యూ

ఏఎస్‌పి విమలకుమారి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

తాను పుట్టిన గడ్డకి, సమాజానికి తనవంతు ఏదైనా చేయాలనే తపనతోనే పోలీసు విభాగంలోకి అడుగెట్టానని తిరుపతి క్రైమ్ ఏఎస్‌పి విమలకుమారి తెలిపారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆమె తన భావాలను వ్యక్తపరిచారు. అవి ఆమె మాటల్లోనే....

ప్రజాశక్తి: పోలీసు ఉద్యోగమే ఎందుకు ఎంచుకున్నారు?

ఏఎస్‌పి : సమాజానికి ఏదైనా చేయాలంటే, మార్పు కోసం ఫైట్ చేయాలన్నా పోలీసు ద్వారా సాధ్యం. అందుకే చిన్నప్పుడే పోలీసును అవ్వాలని నిర్ణయించుకున్నారు. పట్టుబట్టి పోలీసు విభాగంలో చేరాను. ఇదేమి యాదృచ్ఛికంగా రాలేదు. ఎంతో కష్టంతో 1989లో ఎస్ఐగా పోలీసు ఉద్యోగంలో చేరాను.

ప్రజాశక్తి: మీ చిన్నతనానికి ఇప్పుడు మహిళల్లో మార్పు గమనించారు?

ఏఎస్‌పి : 30, 40 సంవత్సరాలకు ముందు మహిళల్లో పెద్దగా అవగాహన లేదు. ఎక్కువ శాతం మహిళలు అన్నింటిని భరించేవారు. ఇప్పుడు అవగాహన పెరగడంతో ప్రశ్నించడం నేర్చుకున్నారు.

ప్రజాశక్తి: విధి నిర్వహణలో మీకు సంతృప్తినిచ్చిన కేసు !

ఏఎస్‌పి : చాలా ఉన్నాయి. అన్నింటినీ చెప్పలేను. కానీ తాను విశాఖపట్టణంలో ఇన్స్‌పెక్టరుగా విధులు నిర్వహించే సమయంలో 1998లో ఓ బ్రాహ్మణ వృద్ధురాల హత్య జరిగింది. ఈ కేసు మాకు సవాళు గా మారింది. పైగా వృద్ధురాలు హత్య నన్ను కలిసి వేసింది. ఈకేసును ఎలాగైనా చేధించాలని భావించాను. మూడు బృందాలతో విచారణ ప్రారంభించాం. ఎక్కడ ఎలాంటి ఆదారాలు లేవు. కానీ విశాఖ జిల్లా నుంచి విజయనగరం జిల్లాకు తీసుకెళ్లి హత్య చేశారు. మృతురాలు కుటుంబ సభ్యులు చెప్పిన విషయాల ప్రకారం ఓ మహిళా వృద్ధురాలిని గుడికి తీసుకెళ్లతానిని చెప్పి, తిరిగి రాలేదు. ఆ దిశగా విచారణ ప్రారంభించాం. గుర్తు తెలియని మహిళా ఎవ్వరో తెలియదు. ఎట్టికేలకు ఓ ఇడ్లీ కొట్టు అతనుతో కలిసి ఉంటుందని తెలిసింది. అతను గురించి విచారించి, ఎట్టికేలకు విజయనగరానికి చెందిన వ్యక్తిగా గుర్తించాం. వారి ఇంటికి వెళ్లితే అతని అమ్మ కొడుకు తప్పదారి పట్టడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని చెప్పింది. స్నేహితులు తెలిసిన వాళ్ల ద్వారా ఏలాగోలా అతని ఆచూకి పట్టుకున్నాం. ఓ మహిళతో కలిసి రాజమండ్రిలో ఉంటున్నట్లు తెలిసి అక్కడికి వెళ్లి మకాం వేసి, ఇద్దర్ని చాకచాక్యంగా అదుపులోకి తీసుకున్నారు. వృద్ధురాలి వంటిపై ఉన్న నాలుగు బంగారు గాజులు, ఒక చైన్ కోసం ఆమెను పథకం ప్రకారం హత్య చేసినట్లు వెల్లడైంది. మూడు రోజుల్లో ఈ కేసును పరిష్కరించాం. అది నాకు చాలా ఆత్మసంతృప్తిని ఇచ్చింది.

ప్రజాశక్తి: క్రైమ్ విభాగంలో విధులు ఎలా ఉన్నాయి?

ఏఎస్‌పి: క్రైమ్‌లో రకరకాల కేసులు ఛాలెంజ్‌ను ఇచ్చేలా ఉంటాయి. వాటిని చేధించేందుకు చాలా క్షుణమైన పరిశీలన అవసరం. ఇళ్లల్లో గృహిణిలు చాలా అజాగ్రత్తగా ఉంటున్నారు. బీరువాలకు తాళాలు కూడా సక్రమంగా వేయారు. వేసిన దానికే పెట్టడం, ఫ్రిజ్‌పై పెట్టడం, అందరికీ కనిపించేలా పెట్టడం వంటి చేస్తుండడంతో నింధితులు సులువుగా దొంగతనాలు చేస్తున్నారు. మహిళల్లో అవగాహన పెంచుతున్నాం.

ప్రజాశక్తి: తల్లిదండ్రులకు మీరిచ్చే సూచన?

ఏఎస్‌పి: తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో కాస్త జాగ్రత్త వహించాలి. బిజీ జీవితంలో బార్యభర్తలు ఇద్దరు పనులు చేసుకుంటు పిల్లల పట్ల పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో పిల్లలకు చెడు సావాసాలు ఎక్కువ అవుతున్నాయి. విలువలు మరిచిపోతున్నారు. మానవీయ విలువలను నేర్పించాల్సిన అవసరం ఉంది. అప్పుడు చెడు మార్గల వైపు వెళ్లరు. తల్లిదండ్రులు సహనం కోల్పోవద్దు.

ప్రజాశక్తి: ప్రస్తుతం మహిళలకు కల్పుతున్న అవకాశాలపై !

ఏఎస్‌పి: పురుషహంకార సమాజంలో పురుషులు, స్త్రీలు సమానం అంటున్నారు. అవకాశాలు ఇచ్చినట్లు ఇచ్చి సమానత్వం అంటునే పెత్తనం చెలియిస్తారు. ఇలాంటి సమానత్వం కాదు మహిళలకు కావాల్సింది. సాటి మనిషిగా గుర్తించి, ప్రోత్సహించి, వారి ఎదుగుదలకు కృషి చేయాలి.

ప్రజాశక్తి: మహిళలకు మీరిచ్చే సలహ?

ఏఎస్‌పి : అన్నింట్లో సగంసగం అంటు ముందుకెళు తున్నారు. భరించి విధానం నుంచి ప్రశ్నించే తత్వానికి అలవాటు పడ్డారు సంతోషం. ఏదో సాధిద్దామని అందరికి ఉంటుంది. కానీ ఏమి సాధించాలనేది ఖచ్చితమైన నిర్దేశం ఉండాలి. అన్నుకున్న లక్ష్యం వైపు పట్టుదలతో ముందుకెళ్లితే తప్పనిసరిగా విజయం తథ్యం. నిరాశనిశృపహలకు తావివ్వొద్దు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చట్టాలను సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలి.

పేరు: బిహెచ్.విమలకుమారి

భర్త : ఎన్.శ్రీనివాసరావు (న్యాయవాది, తిరుపతి)

తల్లిదండ్రులు : లక్ష్మీనరసింహమూర్తి, సరోజని దేవి.

కుటుంబం : ఇద్దరు అన్నలు ఇంజనీరు, లాయరు, ఒక అక్క డాక్టరు, తమ్ముడు డిఫెన్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

1989 జనవరి 16వ తేదీన పోలీసు విభాగంలో ఎస్ఐగా విజయవాడలో విధుల్లో చేరారు. విశాఖపట్టణంలోనూ ఎస్ఐగా విధులు నిర్వహించారు. విజయనగరానికి సిఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. అనంతరం విశాఖపట్టణం టౌన్ శ్రీకాకుళం, తిరుపతిలో సిఐగా పని చేశాను. డిఎస్‌పిగా తిరుపతి, హైదరాబాదు, కర్నూలు, అనంతపురం, తిరుపతి (టిటిడి), చిత్తూరులో విధులు. ఏఎస్‌పిగా పదోన్నతి పొంది విశాఖ పట్టణంలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం తిరుపతి క్రైమ్ ఏఎస్‌పిగా బాధ్యతులు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా మంగళపురానికి చెందిన ఆమెకు ఇప్పటి వరకు 234 రివార్డులు లభించాయి. ఏపి పోలీసు సేవా పతకం అందుకున్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యం

గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలో కలెక్టరు



ప్రజాశక్తి- తిరుపతి సిటి, తిరుపతి టౌన్:

విద్యతోనే మనిషికి సమాజంలో విలువ, గౌరవం లభిస్తుందని, విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా కలెక్టరు కె.వెంకట రమణారెడ్డి అన్నారు. స్థానిక ఆర్‌సి రోడ్డులోని గిరిజన భవన్‌లో శ్రీశంకర్ శాలినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్‌టి కమీషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ గిరిజన సాంస్కృతిక, జానపద ప్రదర్శన కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టరు మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు విద్యను ప్రోత్సహించే వివిధ అవగాహన కార్యక్రమాలు, ప్రతి ఏడాది జానపద కళల సంస్కృతి సాంప్రదాయాల ప్రోత్సహానికి కృషిచేస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. మానవ జీవితంలో విద్య అనేది ప్రముఖ పాత్ర పోషిస్తుందని, మనిషికి సమాజంలో గౌవరం విద్య వల్ల వస్తుందన్నారు. దేవుడు అందరికి ఒకలాంటి మెదడు, జాఒనం ప్రసాదించారని, కానీ మనం విద్య అభ్యసించే విజ్ఞానాన్ని సంపాధించి, ఉన్నత విలువలో కూడిన జీవితాన్ని సాగించడానికి క్రమశిక్షణతో ముందుకెళ్లాలన్నారు. విలువలతో ముందుకెళ్లుతు వ్యక్తిగత జీవిత అభివృద్ధితో పాటు దేశ రాష్ట్ర సమాజ పురోగతిలో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తాను అనంతపురం జిల్లా నుంచి వచ్చానని, ఆ జిల్లాలో నాగినాయని చెరువు తాండ ఒక కుగ్రామం అయినా అందులోని ప్రతి కుటుంబం నుంచి గొప్పగొప్ప ఉద్యోగాలు పొంది, ఉన్నత పదవుల్లో అధికారులుగా ఉన్నారని తెలిపారు. దీని ద్వారా విద్య ఏ ఒకరి సొంతం కాదనే విషయాన్ని గమనించాలన్నారు. డాక్టరు బిఆర్ అంబేద్కర్ ఒక గొప్ప విద్యావేత్త అని, ఆయన భారత రాజ్యాంగ రూపకర్త అని, ఆయన ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, ఆదర్శ సూత్రాలు అనేకం ఆయన విద్యజ్ఞానంతోనే సాధ్యమయ్యాయని గుర్తు చేశారు. ఎస్‌టి కమీషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ మాట్లాడుతూ 2015లో శంకర్ శాలిని ఫౌండేషన్ స్థాపించి గిరిజనులకు విద్య నాగరికత జీవనశైలి నేర్పించడం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం గిరిజన విద్యార్థులచే జాపనపద, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో చెన్నయ్య, బాస్కర్‌రెడ్డి, బాలకొండయ్య, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కంకణబద్ధులం

ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రంలోని ప్రతి అక్క, చెల్లెమ్మలు ఆర్థికంగా అభివద్ధి చెందేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోనలో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, కార్పొరేటర్లు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అక్క చెల్లెమ్మ ఆర్థికంగా అభివద్ధి చెందేందుకు ఈ వైఎస్ఆర్ ఆసరా పథకం ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. రెండు విడతలుగా ఈ ఆసరా చెక్కులు అందించామని, నేడు మూడవ విడత ఇస్తున్నామన్నారు. మన తిరుపతిలో 126 కోట్ల రూపాయలను 3227 సంఘాలకు ఇవ్వడం జరిగిందన్నారు. మేయర్ మాట్లాడుతూ ఇది మహిళా పక్షపాతి ప్రభుత్వం అన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఒక్క తిరుపతిలోని 3227 సంఘాలకు 126 కోట్ల రూపాయలు మాఫీ చేయడం జరిగిందన్నారు. తద్వారా 28763మంది లబ్ధి పొందారన్నారు. కార్పొరేటర్లు కొటేశ్వరమ్మ, ఆధం రాధారెడ్డి, బోకం అనిల్ కుమార్, శంకర్ నారాయణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మెప్మా అధికారిని కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత గోవిందరెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: యువతకు స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ డాక్టర్ గోవిందరెడ్డి అని రాష్ట్ర అవార్డు గ్రహీత వెంకమరాజు అన్నారు. ఆదివారం వడమాలపేట మండల కేంద్రంలోని నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర జోనల్ డైరెక్టర్ స్వర్గీయ డాక్టర్ గోవిందరెడ్డి సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు నాదముని, శ్రీనివాసులు, మురళి ,యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-కోట: శ్రీ ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన వార్షికోత్సవం 2 కే 23 కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆదివారం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయమూర్తి భరత్ కమల్ సబ్ ఇన్స్పెక్టర్ పుల్లారావు, టీఎంఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. గత విద్యా సంవత్సరం పదో తరగతిలో 600 మార్కులకు 584 మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానం సాధించిన గీతిక లక్ష్మి సాయి కి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి భరత్ కమల్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాలలో అద్భుత ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహిస్తున్న ప్రగతి పాఠశాల చైర్మన్ కిషోర్‌ను అభినందించారు. విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరచడాన్ని అభినందించారు. విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ శాలువ, మెమెంటోలతో సత్కరించారు.

ఘనంగా అచ్చెన్నాయుడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు జన్మదినోత్సవాన్ని ఆ పార్టీ నగరి నియోజకవర్గం నాయకుడు పోతుగుంట విజయ్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చెన్నాయుడు సారథ్యంలో టీడీపీ రోజురోజుకు బలోపేతం అవుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ వాణిజ్య విభాగ కార్యదర్శి రవి నాయుడు, జిల్లా టీఎన్‌ఎస్‌ఎఫ్ కార్యదర్శి అరవ ప్రకాష్, తెలుగు మహిళా నియోజకవర్గం కార్యదర్శి నాగరత్నమ్మ, మేఘనాథ్, చంద్రాయాదవ్, రవియాదవ్, ముని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పతనం ఖాయం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీకి గడ్డురోజులు తప్పవని.. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ పతనం ఖాయమని.. వెంకటగిరి, సర్వేపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిలు పంట శ్రీనివాసులు రెడ్డి, చంద్రశేఖర్‌లు ఆరోపించారు. ఆదివారం గూడూరు పట్టణంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యావత్ భారతదేశంలో విశేష స్పందన లభించిందన్నారు. బిజెపి శ్రేణులు ఓర్వలేకనే రాహుల్ గాంధీపై కేసులు బనాయించారన్నారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దుచేసే అనర్హత ప్రకటించడాన్ని దేశంలోని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండిస్తున్నట్లు తెలిపారు. చిన్నచిన్న కారణాలకే అనర్హత వేటు వేసుకుంటూ పోతే ఇప్పుడున్న పార్లమెంటు సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది సభ్యత్వాన్ని రద్దు చేయాల్సి వస్తుందన్నారు. ప్రజాస్వామ్య ప్రమాదంలో ఉందని, ప్రజాస్వామ్య కాపాడుకోవాల్సిన బాధ్యత దేశంలోని ప్రతి ఒక్కరికి ఉందన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడతామన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగభూషణం, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-కోట: కోటలోని గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రమేష్ బేకరీ అధినేత రమేష్ తనయుడు ఎస్.రామ్ ప్రకాష్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం బాలాజీనగర్ లోని ప్రగతి సేవ సంస్థ కార్యాలయంలో 60 మంది నిరుపేద మహిళలకు చీరలు, చికెన్ బిర్యాని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఐ. ధనంజయరెడ్డి, సెక్రటరీ జి.చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, యమహా సుబ్రహ్మణ్యం, రమేష్ (బేకరీ), కార్పొరేషన్ రవి, ఐటిఐ ప్రభాకర్, గ్రానైట్ ప్రభాకర్, కే ఆర్ ఎమ్ దయాకర్, వెంకట కృష్ణయ్య, ఆక్వా రమేష్, కోట వెంకటేశ్వర్లు, నాగరాజు, కృష్ణారెడ్డి, శివ కుమార్‌రెడ్డి, చెన్నూరు శీను తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు శ్రీసిటీ ఎండీ అభినందనలు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: అత్యంత శక్తివంతమైన రాకెట్ ఎల్వీఎం-3 ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయవంతంగా ప్రయోగించినందుకు శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ ప్రయోగం ద్వారా బ్రిటిష్ స్టార్టప్ వన్‌వెబ్ (రెండో విడత) 36 బ్రాడ్‌బ్యాండ్ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి పంపడంలో విజయం సాధించినందుకు ఇస్రో అధ్యక్షులు సోమనాథ్‌కు, షార్ డైరెక్టర్ ఏ. రాజరాజన్‌కు, షార్ శాస్త్రవేత్తలకు, ఉద్యోగస్తులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) ఎల్వీఎం-3 మరొక వాణిజ్య విజయం సాధించడం శ్లాఘనీయమని రవీంద్ర సన్నారెడ్డి అన్నారు.

అక్రమం.. ఇష్టారాజ్యం..!

- తాళ్లాయపాలెంలో అక్రమ లేఅవుట్..!
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని తాళ్లాయపాలెం గ్రామంలో 2018లో బందావనితోపాటు పలువురు కలిసి 8 ఎకరాల 83 సెంట్ల పొలంలో లేఅవుట్ ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 80బిలో 21, 25, 26, 27, 37 నుంచి 44వరకు, సర్వేనెంబర్ 81లో 27 నుంచి 42లో 8 ఎకరాల 83 సెంట్లకు లేఅవుట్ అప్రూవల్‌కు పంపారు.. పై పొలాలకు సంబంధించిన పంచాయతీ ఎల్ఆర్ నంబర్ లేదని.. పంపిన ఎఫ్‌ఎంబీ, కంబైన్ స్కెచ్‌లో ఎనిమిది ఎకరాల 12 సెంట్లకు మాత్రమే రికార్డు ఉన్నందున టౌన్ అండ్ కౌంట్రీ ప్లానింగ్ డిపార్ట్మెంట్ గుంటూరు వారు అనుమతి ఇవ్వకుండా తిరస్కరించారు. అదే సమయంలో గవర్నమెంట్ జీవో ప్రకారం 10 శాతం భూమి గ్రామపంచాయతీకి కేటాయించకపోవడంతో అప్పటి పంచాయతీ కార్యదర్శి, మండల అభివృద్ధి అధికారి గ్రామస్తులు కలిసి వెంచర్ లో ఉన్న రాళ్లను తొలగించి అడ్డుకున్నారు. అప్పటినుంచి గ్రామస్తులు.. వెంచర్ ఓనర్లకు నిరంతరం గొడవలు జరుగుతూ ఈ విషయమై కేసు నమోదైంది. గత ఐదు సంవత్సరాల నుంచి సైలెంట్‌గా ఉన్న ఓనర్లు తిరిగి 2003 మార్చి నెలలో మూడు రోజులు సెలవు దినాలు కావడంతో తిరిగి రాళ్లను నాటి వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విలువలతో కూడిన విద్యతోనే సార్థకత

- రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులకు సార్థకత చేకూరుతుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. విద్యాదానంతో విద్యార్థితో పాటు ఆ కుటుంబం అభివద్ధి చెందుతుందన్నారు. పుత్తూరు పట్టణంలోని జ్ఞానజ్యోతి విద్యామందిర్ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు అలవరచుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి విద్యార్థుల సంక్షేమం కోసం చేస్తున్న కృషికి విద్యార్థులు బాగా చదివి మంచి స్థాయిలో స్థిరపడి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని కోరారు. జ్ఞానజ్యోతి కరెస్పాండంట్ ప్రకాష్ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో డీఈవో శేఖర్, ప్రిన్సిపల్ హరినాథ్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఏ హరి, వైస్ చైర్మన్లు జయప్రకాష్, నింద్ర ఎంపీపీ, కౌన్సిలర్లు వనిత కార్తికేయన్, ఎంపీటీసీలు, స్టేట్ డైరెక్టర్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, జ్ఞానజ్యోతి హైస్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

వరదుని విగ్రహ తొలగింపులో విపక్షాలపై చిన్నచూపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధాలమైన శ్రీ ప్రసన్న వరదరాజస్వామి ఆలయం పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మూల విరాట్టు తొలగించే సమయంలో విపక్ష పార్టీలకు చెందిన వారిని ఆహ్వానించక పోవడం బాధాకరమని టీడీపీ నియోజకవర్గం ఇన్చార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో ఎంతో ప్రసిద్ధి చెందిన వరదుని ఆలయంలో మూల విరాట్టు తొలగించే సమయంలో ఇలా విపక్ష సభ్యులకు కనీస సమాచారం ఇవ్వక పోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మూల విరాట్టు తొలగింపు సమయంలో కేవలం అధికార పార్టీ నేతలే అక్కడ ఉన్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. మూలవిరాట్టు కింద బగారు నాణేలు, లక్ష్మీ కాసులతో పాటు మరికొన్ని ఆభరణాలు లభ్యమైనట్లు పత్రికల్లో చూసి తాము తెలుసుకున్నామన్నారు. ఇక్కడ ఎంత మేరకు ఆభరణాలు లభ్యమయ్యాయో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ పట్టణ ప్రజలకు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. మూలవిరాట్టు కింద లభ్యమైన బంగారును హైదరాబాదులో విక్రయించడానికి వీరు ప్రయత్నిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందని ఆరోపించారు. దేవుని సొమ్మును కాజేస్తే భవిష్యత్తులో వారికి తగిన శాస్తి జరుగుతుందన్నారు. ఇక ఆలయ నిర్మాణంలో వినియోగించిన రాళ్లను క్రమ పద్ధతిలో భద్రపరచకుండా ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారన్నారు. ఈ రాళ్లను క్రమ పద్ధతిలో వరుస సంఖ్యలు ఇచ్చి భద్ర పరచాలని బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి డిమాండు చేశారు. సమావేశంలో గాలి చలపతినాయుడు, గాలి మురళీ నాయుడు, కాసరం రమేష్, ధనంజయలు నాయుడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే కాంగ్రెస్ ఊరుకోదు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్ గాంధీ పై అనర్హత వేటువేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని పీసీసీ సభ్యులు మాంగాటి గోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మోదీలంతా కేడీలని రాహుల్ గాంధీ అన్న నిజాన్ని సూరత్ కోర్టులో (పరువు నష్టం కింద కేసు వేస్తే) ఈ కేసులో రాహుల్ గాంధీపై తప్పుడు కేసుగా రుద్ది, రెండు సంవత్సరాలు జైలుశిక్ష అంటూ తీర్పు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇలా రాహుల్ పై రాజకీయంగా కక్ష సాధింపుతో ఎన్నికల్లో అడ్డు తొలగించుకోవడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ వేటుతో పార్లమెంటుకు రాహుల్ రాలేడని, భవిష్యత్ మొత్తం బిజెపి ప్రభుత్వంగా ఉండాలని కుట్రపన్నారన్నారు. దేశ ప్రజలు ఇదంతా గమనిస్తున్నారన్నారు. ఈ కుట్ర పూరిత చర్యతో రాహుల్ గాంధీ పై సానుభూతి పెరుగుతుందే తప్ప బిజెపి కుట్రపూరిత రాజకీయాలు మరింత కాలం సాగవన్నారు. ఇక మోడీకి రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గోపి గౌడ్, నరసింహులు, శ్రీనివాస్, రామచంద్ర, దూది రమేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలే వైసీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్ష

ప్రజాశక్తి -రేణిగుంట: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలే వైసీపీకి శ్రీరామరక్ష అని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ రసూల్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ రసూల్ ను మైనార్టీ నాయకులు భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీకి కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అందుకు ఉదాహరణ మహమ్మద్ రసూల్ కు తిరుపతి జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పదవి ఇవ్వడం జరిగిందని ఆనంద వ్యక్తం చేశారు. వైసీపీ ముస్లింలకు పెద్దపీట వేసిందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన బిడ్డ పవిత్రమ్మ అందుబాటులో ఉంటారని.. సమస్యలు ఫోన్ ద్వారానైనా.. నేరుగా వచ్చి తనకు తెలియజేసినా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా బియ్యపు కుటుంబం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బియ్యపు పవిత్ర రెడ్డి మాట్లాడుతూ ముందుగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీలో ముస్లిం మైనార్టీలకు అత్యుత్తమ స్థానం కల్పించిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండలాధ్యక్షుడు, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్, తూకివాకం సర్పంచ్ మునిశేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, మండల కో-ఆప్షన్ సభ్యులు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు సుభాన్ రాజా, ప్రముఖ న్యాయవాది జాకీర్ హుస్సేన్, లాంకో మహబూబ్ బాషా, మాబు, మైనార్టీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, జిల్లా జాయింట్ సెక్రెటరీ, వార్డు మెంబర్ ఇరానీ ఖాదర్, మస్తాన్, హసన్, రాజేంద్ర, మాజీ ఎంపీటీసీ నాగరాజు, రమణ, రామ్మోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిక వైసీపీలో అసమ్మతి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ వైసీపీ మండలాధ్యక్షుడు విద్యానాథ్‌రెడ్డిపై స్థానికంగా కొందరు నాయకుల అసమ్మతి కొనసాగుతోంది. శనివారం ఉదయం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి నాయకులు ఫిర్యాదు చేయగా ఆదివారం రోజు జరిగిన మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో విద్యానాథరెడ్డిని ఎంపీపీ సలహాదారుడిగా సభా వేదికపై రావాలని ప్రకటించడంతో వైసీపీ ఎంపీటీసీలు కొంతమంది, సర్పంచులు మరికొంతమంది సభ నుంచి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ పరంగా.. పాలనాపరంగా మండలంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని అటు పార్టీలో పార్టీ కార్యకలాపాలపై నాయకులకు.. కార్యకర్తలకు ప్రాధాన్యత లేదని మరోవైపు పాలనా పరంగా జరిగే అభివద్ధి కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు సమాచారం గాని.. సముచిత స్థానం గాని లేదనేది అసమ్మతి నాయకుల ఆరోపణ. పార్టీలో భేదాభిప్రాయాలు.. భిన్న ఆలోచనలు ఉండటం సహజమేనని పార్టీ బలోపేతానికి అందరూ ఏకమవుతామని ఏకాభిప్రాయానికి వచ్చి విభేదాలు వదిలి వైసీపీ కుటుంబం ఏకమవుతుందని విద్యానాథరెడ్డి చెబుతున్నారు.

దివ్యశ్రీకి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఈఈఈ విభాగపు పరిశోధక విద్యార్థి చిప్పడ దివ్యశ్రీ కి డాక్టర్ ప్రదానం చేసినట్లు పరీక్షలు నియంత్రణ అధికారి ఎం. దామ్లా నాయక్ ప్రకటనలో తెలిపారు. ఆచార్య యం. దామోదర్ రెడ్డి పర్యవేక్షణలో " ఆప్టిమల్ ప్లేస్మెంట్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ యూనిట్స్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్స్ ఇన్ రేడియల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ " అనే అంశంపై పరిశోధన గ్రంధాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను ఆమెకు డాక్టరేట్ డిగ్రీ ఇచ్చినట్లు వివరించారు. దివ్యశ్రీ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించినట్లు వెల్లడించారు. దివ్యశ్రీ కి డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో ముందుండాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ , గూడూరు ఆధ్వర్యంలో నిర్వహించిన మర్రి రాఘవయ్య క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. విజేతగా రాజ మండ్రి టీమ్ నిలిచింది. రన్నర్ గా గూడూరు ఆర్.పి.ఎఫ్ టీమ్ నిలిచింది. విజేతలకు బహుమతులు అందించారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-క్యాంపస్: రాజమండ్రిలోని వెంకటాద్రి గార్డెన్స్‌లో 26వ తేదీ ఆదివారం ఉదయం అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు యంవీ.రామచంద్రారెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. ఇందుకు గాను ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అపుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు డా.యన్. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివద్ధిని చూసి ప్రజలు ఓటేశారని ఎమ్మెల్సీగా గెలిచిన రామచంద్ర రెడ్డి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ అడ్వైసర్ కే.ఎస్.వాసు, తిరుపతి జిల్లా అధ్యక్షులు బీ.రవీంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో సరస్వతిపూజ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆదివారం సాయంత్రం వసతి గృహ అధికారిణి సుభాషిని ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనందరావు పిల్లలను ఆశీర్వదించారు. తిరుమల డెయిరీ మేనేజర్ కార్తీక్‌నాయుడు విద్యార్థినులకు పరీక్షా సామగ్రి అందించారు. వార్డెన్ రవి, శేఖర్, రమేష్, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

గూడూరులో జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గూడూరు: మాజీ మంత్రి అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల జన్మదిన వేడుకలను గూడూరులోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాశం సునీల్ కుమార్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, పట్టణం అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, చిల్లకూరు మండలం పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లురెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

దేవుడిపై రాజకీయం వద్దు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి దేవుడిపై రాజకీయాలు చేయడం మానుకోవాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు హితవు పలికారు. ప్రసన్న వరదరాజస్వామి మూల విరాట్టు తొలగింపులో పానపట్టం కింద లభ్యమైన ఆభరణాలను అమ్మకానికి పెట్టారన్న ఆరోపణలపై ఆధారాలు ఉంటే నిరూపించాలంటూ ఆయన సవాల్ విసిరారు. స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలనా భవనంలో ఆలయ పాలకమండలి సభ్యులతో కలిసి ఆదివారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రసన్న వరదరాజ స్వామి మూలవిరాట్టు తొలగింపు కార్యక్రమం అత్యంత పారదర్శకంగా, పటిష్ట భద్రత నడుమ జరిగిందన్నారు. దీనిపై విపక్షాలకు సమాచారం ఇవ్వలేదని బొజ్జల సుధీర్ రెడ్డి చెప్పడం అర్థరహిత వ్యాఖ్యలన్నారు. ఆధారాలు ఉంటే రుజువు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానిక ఆలయంలోనైనా, లేకుంటే కాణిపాకంలోనైనా ప్రమాణం చేసేందుకు రావాలని సవాలు విసిరారు.

డ్యామ్‌లో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని ఉదయ మాణిక్యం తొపిరెడ్డిగారిపల్లి సమీపంలోని రెడ్డిచెరువుకు చెందిన ఏటిసార చెక్‌డ్యాంపై నుంచి మద్యం మత్తులో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. మృతుడు చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలు పంచాయతీ నల్లఓబులపల్లికి చెందిన సురేష్(37)గా గుర్తించారు. సమాచారం అందుకున్న భాకరాపేట సీఐ తులసీరామ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సంఘటన స్థలానికి చేరుకొని మృతుడిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్తకొత్త మార్గాల ద్వారా మోసం చేస్తున్నారు. ఇదే క్రమంలో ఈనెల 23వ తేదీన తిరుపతికి చెందిన కల్పన అనే మహిళను ఒక అనామకుడు విద్యార్థి పేరుతో రూ.50వేలు కాజేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన పోలీసుల వివరాల మేరకు... తిరుపతికి చెందిన కల్పన అనే మహిళలకు ఓ అనుమానిత నెంబర్ నుంచి ఓ మెసెజ్ ద్వారా ఓ వ్యక్తి తాను మీ పూర్వ విద్యార్థి అని పరిచయం చేసుకున్నాడు. పరిచయం నమ్మకమైన తర్వాత నేను మీ స్టూడెంట్‌ని మేడం ప్రస్తుతం ఆర్మీలో పని చేస్తున్నాను, ఆర్మీ క్యాంటీన్లో నాకు అన్ని రకాల వస్తువులు తక్కువ ధరకే వస్తాయని, మీకు కావాలంటే బెంగుళూరు ఆర్మీ క్యాంటీన్ నుంచి అన్ని ఐటమ్స్ తక్కువ ధరకే పంపిస్తానని నమ్మబలికి ఎయిర్‌టెల్ మనీ పేమెంట్ బ్యాంకు అకౌంట్ ద్వారా 59వేల రూపాయలు వేయించుకున్నాడు. రోజుల గడుస్తున్న తనకు సరుకులు రాకపోయేసరికి, అతనికి ఫోన్‌చేస్తే ఏలాంటి సమాధానం లేదు, ఏకంగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు తిరుపతి సైబర్ క్రైమ్ ల్యాబ్‌కు వచ్చి అధికారులను సంప్రదించి, సిఐ రామచంద్రారెడ్డికి జరిగిన మోసాన్ని వివరించింది. వెంటనే స్పందించిన పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వారి సూచనలతో ఎన్‌సిఆర్‌ఫిలో ఫిర్యాదు నమోదు చేసి, బాధితురాలి అకౌంట్ నుంచి ఎయిర్‌టెల్ మనీ పేమెంట్ బ్యాంగ్ అకౌంట్‌కే ట్రాన్స్‌ఫర్ అయిందాని గ్రహించి, వెంటనే నేరగాడి అకౌంట్‌ను ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారుల సహాయంతో సైబర్ క్రైమ్ ల్యాబ్ పోలీసులు సీజ్ చేశారు. అనంతరం బాధితురాలు పోగొట్టుకున్న మొత్తాన్ని ఆమెకు చెందిన కెనరా బ్యాంకు అకౌంట్‌కు బదిలీ చేయించారు. దీంతో బాధితులకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు సైబర్ నేరాలకు బలైన బాధితులకు ఎఫ్ఐఆర్ లేకుండానే ఎన్‌సిఆర్‌ఫి ద్వారా రీఫండ్ చేయిస్తున్నామని పోలీసు అధికారులు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మోసపోయమని తెలిసిన వెంటనే తమను సంప్రదిస్తే న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ధర్నా

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. స్థానిక రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద జరిగిన ధర్నానుద్దేశించి పిసిసి కార్యదర్శి యార్లపల్లి గోపిగౌడ్, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు రవి మాట్లాడుతూ బిజెపి పాలనలో దేశవ్యాప్తంగా నియంతృత్వం పెరిగిపోయిందని అన్నారు. బిజెపి విధానాలను ప్రశ్నించిన రాహుల్‌గాంధీ ఎంపి సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికం అన్నారు. బిజెపి పాలనలో ప్రశ్నించే గొంతులకు రక్షణ కరువైందన్నారు. మోడీ దేశసంపదను కార్పొరేట్ శక్తులకు పంచిపెడుతుంటే తమ నాయకులు రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వ విధానాలను విమర్శించడం నేరమా అని ప్రశ్నించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీ నాయకులను అణగదొక్కాలని బిజెపి తీవ్రంగా ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు కాంరగెస్ ముందుంటుందని అన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పదని హెచ్చరించారు. నాయకులు పూతలపట్టు ప్రభాకర్, తేజోవతి, జావేద్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో గంజాయి అధికారుల వైఫల్యమే..!

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో మూడంచెల భద్రత ఉన్న గంజాయి రావడం అధికారుల వైఫల్యమని, దీనిపై టిటిడి భద్రత అధికారులు విచారణ చేపట్టి సంబంధం ఉన్న ప్రతిఒకరిపై చర్య తీసుకోవాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్ రెడ్డి డిమాండు చేశారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామదర్శన సమయంలో రాష్ట్ర ప్రభుత్వవిప్ ప్రసాద్‌రావు, బిజెపి నేత భానుప్రకాష్ రెడ్డి వేర్వేరుగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం బిజెపి నేత భాను ప్రకాష్‌రెడ్డి ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ తిరుపతి నగరం గంజాయి వనంగా మారిందని, తిరుపతి నగరంలో గంజాయిపై అధికారులకు పలుసార్లు విన్నపించిన పట్టించుకోని దాఖలాలు లేవని ఆయన చెప్పారు.

టాటా మోటార్స్ వాణిజ్య ధరలు పెంపు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: భారతదేశంలో అతిపెద్ద వాణిజ్య వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ ఏప్రిల్ 1వతేదీ నుంచి తన వాణిజ్య వాహనాలపై ధరలు పెంపును అమలు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మరింత కఠినమైన బిఎస్6 ఫేజ్ 2 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా కంపెనీ చేసిన ప్రయత్నాలు ఫలితంగా ధరలు పెంపు నిర్ణయం తీసుకున్నామన్నారు. టాటా మోటార్స్ తన మొత్తం వాహన పోర్ట్‌పోలియాను ఈ ప్రమాణాలకు అనుగుణంగా మార్చిందని పేర్కొన్నారు. వినియోగదారులు, ఫ్లీట్ యాజమానులు అధిక ప్రయోజనాలను, యాజమాన్యం మొత్తం ఖర్చును అందించే క్లీనర్, గ్రీన్, సాంకేతికంగా ఉన్నతమైన ఆఫర్లను ఆశించవచ్చన్నారు. మొత్తం వాణిజ్య వాహనాల శ్రేణిలో ధరలు పెరుగుదల వర్తిస్తుందని, వ్యక్తగతి మోడల్, వేరియంట్‌ను బట్టి ధరలను మొత్తం మారుతాయని వెల్లడించారు. వినియోగదారులు మార్పును గమనించాలని కోరారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE AT PUTTUR
E. A. NO. 103 / 2020, E. P. NO. 22 / 2020
O.S. NO. 233 / 2019

BETWEEN:
B Jagannadham ...Decree holder
AND
1. J. Veeraswamy
2. J. Eswaramma ...Judgment debtors

NOTICE TO RESPONDENT / JUDGMENT DEBTOR NO.2

To
Respondent/J.Dr.No.2
J.Eswaramma, W/o Ellaiah,
Residing at Palamangalam North H/W Village,
Palamangalam Post, Narayanavanam Mandal,
Tirupati District.
Sri
Please take notice in E.A.No.103/2020& E.P.No.22/2020 that the D.Hr field the above contempt E.P against you for voilation of injunction order, hence this case is posted for your appear on 28-04-2023 at 10.30 A.M If you have got any objections you may appear on 28-04-2023 at 10.30A.M either in person or through your conused and file your objections. In the event of your filure, the matter will be decided exparte.

Sri Modi Sanjeevi, M.A., LL.M.,
Advocate for D.hr, PUTTUR